సాక్షి
మంచిర్యాల
ఆదివారం। 6। ఆగస్టు। 2023



కాజ్‌వేనే దిక్కా..? 10లో▸

మంచిర్యాలలోని రాళ్లవాగుపై ఉన్న కాజ్‌వే ఏటా వర్షాలకు కూలిపోతోంది. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.



బోడకాకర కిలో రూ.300

నెన్నెల: వర్షాకాలం సీజన్‌లో మాత్రమే లభించే బోడ కాకరకాయ శనివారం నెన్నెల మార్కెట్‌లో కిలో రూ.300 పలికింది. అయినప్పటికీ కొనుగోలు ప్రజలు ఆసక్తి చూపారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పశ్చిమ నైరుతి దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

స్నేహమేరా శాశ్వతం..!

నేడు స్నేహితుల దినోత్సవం

స్నేహం అపురూపం.. వర్ణించలేని బంధం.. ఆపదలో ఆదుకునే భరోసా నేస్తం. రక్తసంబంధం కంటే ఎక్కువగా పెనవేసుకునేది దోస్తాన్.. విద్య, ఉద్యోగం, వ్యాపారం ఇలా ఏ రంగంలోనైనా జీవిత కాల ప్రయాణంలో కొత్తగా చిగురిస్తూ కొత్త ఉత్సాహాన్నిచ్చేదే ఫ్రెండ్‌షిప్.. కొందరు స్నేహితుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ.. సమాజహితానికి తోడ్పడుతున్నారు. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..



ఉమ్మడి కుటుంబంలా..



స్నేహితులందరూ టూర్ వెళ్లినప్పుడు

దండేపల్లి: మండల కేంద్రంలోని 1996, 97, 98, 99 ఎస్సెస్సీ బ్యాచ్‌లోని కొందరు, మిత్రులు, వీరందరికీ సీనియర్ బ్యాచ్ 1986కు చెందిన మరికొందరు కలిసి మైఫ్రెండ్ గ్రూపుగా ఏర్పడ్డారు. ప్రతినిత్యం వాట్సాప్, ఫోన్‌కాల్స్‌తో బాగోగులు పంచుకుంటారు. ఫంక్షన్లు జరిగితే ఒకరి ఇళ్లకు ఒకరు కుటుంబ సమేతంగా వెళ్తుంటారు. పర్యాటక ప్రదేశాలకు వెళ్లాలన్నా అంతా కలిసే ఉమ్మడి కుటుంబంలా వెళ్తుంటారు.

విద్యార్థి దశలో చిగురించి..



కుటుంబ సభ్యులతో బెజ్జంకి శ్రీధర్(కుడి), బానోత్ మురళి(ఎడమ)

పాతమంచిర్యాల: జిల్లా టెలికాం అధికారి బెజ్జంకి శ్రీధర్, హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ డెవపల్‌మెంటు ఆర్గనైజేషన్‌లో సైంటిస్టు బానోతు మురళి స్నేహితులు. మూడు దశాబ్దాలు(1993నుంచి)గా స్నేహబంధం కొనసాగుతోంది. పాలిటెక్నిక్, బీటెక్ వరకు క్లాస్‌మేట్స్, రూమ్‌మేట్స్‌గా ఉన్నారు. తర్వాత కొంతకాలం జిల్లాలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో లెక్చరర్ ఉద్యోగం చేసి తర్వాత మురళి రక్షణ శాఖలో, శ్రీధర్ టెలికాం శాఖలో ఉద్యోగం పొందారు. విద్యార్థి దశలో స్నేహం చిగురించగా.. ఇప్పటికీ ఫోన్‌లో యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. మూడు నెలలకోసారి యూఎస్‌లో ఉంటున్న తమ క్లాస్‌మేట్స్, స్నేహితులను కుటుంబ సభ్యులతో సహా కలుస్తున్నారు.

వ్యాపార భాగస్వాములై..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని పాత బెల్లంపల్లికి చెందిన కారుకూరి ప్రభాకర్, కాసిపేటకు చెందిన మార్త శివప్రసాద్ 2013లో మంచిర్యాలలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ నుంచి స్నేహితులయ్యారు. ప్రభాకర్ ఎంబీఏ పూర్తి చేయగా, శివప్రసాద్ బీఈడీ చేసి టెట్ అర్హత సాధించాడు. ఇద్దరూ కలిసి వ్యాపారం దిశగా అడుగులు వేశారు. 2019లో మంచిర్యాలలో వెడ్డింగ్ మంత్ర పేరుతో బోటిక్, వెడ్డింగ్ ఈవెంట్స్ ప్రారంభించారు. రూ.15 లక్షలతో వ్యాపారం ప్రారంభించగా ఇప్పుడు 25 మందికి ఉపాధి కల్పిస్తూ సరికొత్త డిజైన్‌లతో ఫ్యాషన్ ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నారు. సేవల్లోనూ ముందుండగా విద్యా సంవత్సరం ఆరంభంలో నోట్‌బుక్స్ పంపిణీ, వెడ్డింగ్ మంత్రలో పని చేసే వారికి ఆర్థిక సహాయం చేస్తున్నారు.

ప్రభాకర్, శివప్రసాద్



వాట్సాప్ గ్రూపుగా ఏర్పడి..



స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం(ఫైల్)

దండేపల్లి: మండలంలోని ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1992–93 బ్యాచ్ పదో తరగతి మిత్రులు పరీక్షల తర్వాత ఉన్నత చదువులకు వెళ్లి దూరమయ్యారు. ఆ తర్వాత వివిధ హోదాల్లో స్థిరపడి ఎక్కడెక్కడో ఉన్నప్పటికీ ఆరేళ్ల క్రితం ఓ వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. మిత్రులు, వారి కుటుంబాలకు ఏదైనా ఆపద వస్తే ఒకరికొకరు అండగా నిలుస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా డబ్బులు జమ చేసి ఆపదలో ఉన్న మిత్రుల కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

'ఫ్రెండ్స్' అనిమల్ ట్రస్టు

- జంతువులకు సేవ
- నేడు పలు రాష్ట్రాలకు చేరిన వైనం
- సోషల్ మీడియా ప్రచారంతో విస్తృతం



కోతులకు పండ్లు అందిస్తున్న పద్మ సందేశ్ గుప్తా

మంచిర్యాలటౌన్: ఆహారం అందక ఏ జంతువులూ చనిపోవద్దని నలుగురు స్నేహితులు కలిసి 'సేవే మార్గం..సేవే లక్ష్యం, సేవ్ నేచర్.. సేవ్ అనిమల్స్ ట్రస్టు' పేరిట వాటికి కావాల్సిన ఆహారం, పండ్లు అందించేందుకు 2017లో సెప్టెంబర్ 24న 'ఫ్రెండ్స్ అనిమల్ ట్రస్టు' ఏర్పాటు చేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన పద్మ సందేశ్‌గుప్తా ఆలోచనతో ఆయనే వ్యవస్థాపక చైర్మన్‌గా ప్రారంభించిన ట్రస్టుకు తనకు తెలిసిన వారు, వారి స్నేహితుల నుంచి ఒక్క రూపాయి ట్రస్టుకు చెల్లించి జంతువుల ఆకలి తీర్చాలని కోరుతూ ప్రచారం చేస్తున్నారు. కోతులు ఆహారం దొరక్క రోడ్లు, గ్రామాలు, పట్టణాల్లోకి వలస వస్తున్నాయి. రహదారుల వెంట ఆహారం కోసం అలమటిస్తూ అటు ఇటు తిరుగుతూ వాహనాలు ఢీకొని మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి.

వారంలో మూడు రోజులు సేవ

ఫ్రెండ్స్ అనిమల్ ట్రస్టు ద్వారా ప్రతీ ఆదివారం జైపూర్ అటవీ ప్రాంతంలోని రోడ్లపై, మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం వద్ద, గురువారం మంచిర్యాల క్వారీలోని కోతులకు పండ్లు ఆహారంగా అందిస్తున్నారు. ట్రస్టుకు పలువురు దాతలు, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని మిత్రులు సహకరిస్తున్నారు. గాయపడిన జంతువులకు ప్రథమ చికిత్స అందిస్తున్నారు. మృతిచెందిన వాటిని ఖననం చేసి మూగజీవాలపై ప్రేమను చాటుకుంటున్నారు.

ఒకరి నుంచి మరొకరి ద్వారా సహకారం

నా మనసులో మెదిలిన ఆలోచనను నా స్నేహితులకు చెప్పి ఫ్రెండ్స్ అనిమల్ ట్రస్టు ఏర్పాటు చేశాను. ఒకరి నుంచి మరొకరి ద్వారా స్నేహితులకు తెలిసి చాలామంది సహకారం అందిస్తున్నారు. ఒక్క రూపాయి ఇచ్చి జంతువుల సేవకు సహకరించాలని కోరగా వేలాది మంది భాగస్వాములు అయ్యారు. గూగుల్ పే, ఫోన్‌పే 9966229891 ద్వారా ఒక్క రూపాయిని పంపిస్తూ సహకారం అందిస్తున్నారు.

– పద్మ సందేశ్ గుప్తా,
అనిమల్ ట్రస్టు ఫౌండర్, చైర్మన్



మంచిర్యాలలో 'సాక్షి' నిర్వహించిన చర్చావేదికలో పాల్గొన్న విద్యార్థులు

స్నేహం.. గొప్ప వరం..

- 'సాక్షి' చర్చావేదికలో విద్యార్థుల అభిప్రాయం
- కన్నవారికి దూరమై కన్నీటిపర్యంతమైన విద్యార్థిని
- నేనున్నానంటూ భరోసానిచ్చిన కళాశాల చైర్మన్

మంచిర్యాలఅర్బన్: స్నేహం అద్భుతమైంది. స్నేహానికి ఎల్లల్లేవు. కష్టసుఖాల్లో అండగా ఉండేదే నిజమైన స్నేహం అంటూ పలువురు విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం నేపథ్యంలో శనివారం మంచిర్యాల శ్రీహర్ష జూనియర్ కళాశాలలో 'సాక్షి' ఆధ్వర్యంలో చర్చావేదిక నిర్వహించారు. కన్నవారిని కోల్పోయి స్నేహితుల ప్రోత్సాహంతో చదువు సాగిస్తున్న విద్యార్థిని విష్ణుప్రియ కన్నీటి పర్యంతమైంది. విద్యార్థిని కుటుంబ పరిస్థితులు తెలుసుకుని చలించిపోయిన శ్రీహర్ష విద్యాసంస్థల చైర్మన్ పల్లె భూమేష్ అన్నివిధాలా ఆదుకుంటానంటూ భరోసా కల్పించారు. ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ 'సాక్షి'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చర్చావేదికలో విద్యార్థుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచేవాడు..



కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచేవాడు నిజమైన స్నేహితుడు. ప్రతీ బాధలో నేనున్నానని ధైర్యం చెప్పడంతో బాసటగా నిలుస్తాడు. మంచిస్నేహం ఉన్నతస్థానానికి చేర్చుతుంది. చదువులో కూడా తమవంతుగా సహాయపడుతూ ప్రోత్సహించాలి.

– విజేందర్‌బాబు, విద్యార్థి

స్నేహితుల ప్రోత్సాహంతో..



నా తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయారు. నేను చదువుకుంటున్నాను అంటే నా స్నేహితుల ప్రోత్సాహమే. ఫ్రెండ్స్ లేకుంటే చదువుకునే దాన్ని కాదేమో. కన్నవారిని దూరమైనా.. నన్ను పెంచిపోషించడంలో నాన్నమ్మ, తాతయ్యల పాత్ర ఎంతో ఉంది. వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న స్నేహితులూ అంతే..(ఈ సమయంలో ఉద్వేగభరితంతో కన్నీటి పర్యంతమైంది. వేదికపై ఉన్న పల్లె భూమేష్ మేమంతా మీ స్నేహితులమే అంటూ ఓదార్చారు.)

– విష్ణుప్రియ, విద్యార్థిని

ఎప్పటికీ మరిచిపోలేనిది..



మంచి స్థితిలో ఉన్నప్పుడు స్నేహ బంధాలు కొనసాగించి ఇబ్బందులు పడగానే దూరంగా ఉండడం మానవీయత కాదు. సుఖాలు, కష్టాలు ఏదైనా అన్నింట్లో పాలుపంచుకోవాలి. కష్టాల్లో ఆదుకోవడమే కాదు.. లోపాలుంటే సరిదిద్దేందుకు ప్రయత్నించినవారే నిజమైన స్నేహితులు.

– అంజలి, విద్యార్థిని

మంచి స్నేహంతోనే..



మంచి స్నేహం భవిష్యత్‌కు మార్గం చూపిస్తుంది. చెడు అలవాట్లు కలిగిన వారికి దూరంగా ఉండాలి. సినిమాలు, షికార్లు అంటూ తిరగకుండా చదువును ప్రోత్సహించే వారే నిజమైన స్నేహితులు. ఇంట్లో వారితో చెప్పుకోలేని విషయాలను కల్మషం లేకుండా స్నేహితులతో మాత్రం చెప్పుకుంటాం.

– శ్రావణ్‌కుమార్, విద్యార్థి

చదువు పూర్తయ్యే వరకు బాధ్యత తీసుకుంటా..



స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' నిర్వహించిన చర్చావేదిక ద్వారా విష్ణుప్రియ తల్లిదండ్రులు లేరనే విషయం తెలిసింది. విద్యార్థిని ఇంటర్, డిగ్రీ చదువు పూర్తయ్యేంత వరకు నేను బాధ్యత తీసుకుంటాను. పుస్తకాలు, ఫీజులు ఇతర ఏ ఖర్చులున్నా నా వంతు సహకారం అందించేందుకు హామీ ఇస్తున్నా. అమ్మానాన్న లేరని బాధపడకూ.. మేమందరూ మీ స్నేహితులమే.

– పల్లె భూమేష్, శ్రీహర్ష విద్యాసంస్థల చైర్మన్

న్యూస్‌రీల్

ఎంసీహెచ్‌కు ఎమ్మెల్యేకు సంబంధం లేదు

- మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య




మాట్లాడుతున్న చైర్మన్ పెంట రాజయ్య

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని గోదావరి నది ఒడ్డున మాతాశిశు కేంద్రం (ఎంసీహెచ్) నిర్మాణానికి ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావుకు ఎలాంటి సంబంధం లేదని మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రం నిర్మాణ సమయంలో ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లిందని, ఆ సమయంలో దివాకర్‌రావు ఎమ్మెల్యేగా లేరని, నాటి జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులే ఆ స్థలాన్ని నిర్ణయించి, ఎంసీహెచ్ నిర్మాణం చేపట్టారని అన్నారు. కానీ ఎంసీహెచ్ ముంపు ప్రాంతంలో కట్టారంటూ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్నారని, తమ ఎమ్మెల్యేకు సంబంధం లేకుండా జరిగిన నిర్మాణంపై ప్రతిపక్షాలు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వరదలు వస్తున్నాయని తెలిపారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, కౌన్సిలర్లు గాదె సత్యం, సుదమల్ల హరికృష్ణ, పోరెడ్డి రాజు, నాయకులు బొలిశెట్టి కిషన్, తాజ్, సాగర్, సుంకరి రమేశ్, జూపాక సుధీర్ పాల్గొన్నారు.

అది అటవీ భూమే !

- బొక్కలగుట్టలో 11.09 ఎకరాల్లో అధికారుల నిర్ధారణ
- ఆ పట్టాలు రద్దు చేయాలంటూ సిఫారసు
- 'సాక్షి' కథనాలతో విచారణ జరిపి నివేదిక అందజేత



అధికారుల లేఖలో 'సాక్షి' కథనాలు





'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం తిమ్మాపూర్ శివారు బొక్కలగుట్టలో వివాదాస్పదమైన 11.09 ఎకరాల భూమి అటవీశాఖకు చెందినదేనని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. 11సర్వేనంబరులో ఉన్న భూమిలో పట్టాలు రద్దు చేస్తూ భవిష్యత్‌లో ఎలాంటి పట్టాలు ఇవ్వొద్దంటూ ఉన్నతాధికారులకు విచారణ అధికారి నివేదిక అందజేశారు. ఈ భూమిలో జరుగుతున్న అక్రమాలపై గత జూన్ 29న 'సర్వే నంబరే మార్చేశారు', గత జూలై 4న 'నంబరు మార్చి పట్టా' శీర్షికన 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన రెవెన్యూ, అటవీ, మున్సిపల్, సర్వే అధికారులు ఉమ్మడిగా సర్వే చేశారు. క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ విచారణ జరిపి లే అవుట్ అనుమతులు నిలిపి వేయాల్సిందిగా అటు రెవెన్యూ ఇటు టౌన్ ప్లానింగ్ అధికారులకు లేఖ రాశారు. తాజాగా అటవీశాఖ నుంచి ఫారెస్టు రేంజి అధికారి సైతం సర్వే నంబరు 11గా చెబుతున్నది అటవీ భూమిగా పేర్కొంటూ ఓ నివేదిక జిల్లా అటవీ అధికారికి అందజేశారు.

ఆ ఆసామి నిర్వాహకమే

బొక్కలగుట్ట శివారులో అటవీ భూమికి ఆనుకుని ఉన్న సర్వే నంబరు 11గా చెబుతున్న భూమిలో 11.09 ఎకరాల భూమి ఉంది. ఇందులో బొక్కలగుట్ట గ్రామస్తులకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చారు. అక్కడ ఎవరూ ఇళ్లు నిర్మించుకోకపోవడంతో కొన్నేళ్లపాటు పడావుగా ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని గ్రామానికి చెందిన ఓ ఆసామి తన పూర్వీకుల పేర్లు పాత పహాణీల్లో ఉన్నాయంటూ 2005లో ఇద్దరు వ్యక్తులకు తన కూతురి పేరుతో విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించారు. ఇది అటవీ భూమి సర్వే నంబరు 31 ఉండడంతో ఉరఫ్ నంబరుతో 31లో ఒకటి నుంచి 11గా పట్టాలు, రికార్డుల్లో ఉంది. తర్వాత 31తొలగించి 11సర్వే నంబరుగా మార్చేశారు. వాస్తవానికి క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో భీమా గార్డెన్ వెనుక రెగ్యులర్ సర్వే నంబరు 11ఉంది. ఆ సర్వే నంబరులో ఉన్నది మొత్తం 1.23ఎకరాలే. అక్కడి భూమిని, ఇక్కడి భూమి కలిపేస్తూ ఒకే 11సర్వే నంబరుపై మొత్తం 12.32ఎకరాలను రికార్డుల్లోకి ఎక్కించారు. కానీ ధరణిలో మొదట అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదంతో నిషేధిత జాబితాలో ఉంది. అప్పట్లో జాయింట్ సర్వే సయమంలో అటవీ హద్దు రాళ్లపై తప్పుడు సమాచారం ఇచ్చి నిషేధం ఎత్తేయించారు. దీంతో విక్రయదారులు కొత్త పాస్ పుస్తకాలు సైతం పొందారు. ఇటీవల ఆ భూమిని అధికార పార్టీకి చెందిన నాయకులు, మంచిర్యాలకు చెందిన రియల్ వ్యాపారులు కలిసి వెంచరు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ వ్యవహారమంతా బయటకు రావడంతో రూ.కోట్లు పెట్టి లే అవుట్ అనుమతి పొందే సమయంలో ఆందోళన మొదలైంది. రెవెన్యూ శాఖ అధికారులు బొక్కలగుట్ట గ్రామ మ్యాపు, భూమి ఫైలు విచారణ సందర్భంగా అడిగితే ఇవ్వలేదు. దీంతో అటవీ శాఖకు చెందిన ర్యాలీ గెజిట్ ప్రకారం అవి భూములు తమవేనని నిర్ధారణకు వస్తున్నారు.

రెవెన్యూ అధికారులు ఏం చేస్తారో?

ఓ వైపు అటవీశాఖ ఆ భూమి తమదేనని చెబుతుండడంతో ఇన్నాళ్లు వారికి మద్దతుగా ఉన్న మందమర్రి మండల రెవెన్యూ అధికారులు ఏం చేస్తారనేది పెద్ద ప్రశ్నగా మారింది. ప్రస్తుత 11.09ఎకరాలతో కలిపి మొత్తం 1నుంచి 11వరకు ఉన్న మొత్తం 28.22గుంటలు ఉన్న ఆ భూమిని మళ్లీ నిషేధిత జాబితాలోకి ఎక్కిస్తారా? లేక తమదేనని నిరూపించుకునేందుకు పాత ఫైళ్లు తేస్తారా? అనేది తేలాల్సి ఉంది. ఒక వేళ సర్వే నంబరు 31గా చూపిస్తే అటవీ భూములని స్పష్టమవుతాయి. 11గా చూపిస్తే, రెగ్యులర్ నంబరుతోపాటు గ్రామ మ్యాపులు చూపించాలి. ఈ క్రమంలో అటవీ నుంచి రెవెన్యూకు బదిలీ అయిన ఈ భూములపై రెవెన్యూ అధికారులు ఎలా స్పందిస్తారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సాక్ష్యాధారాలతోనే నిందితులకు శిక్ష

- జిల్లా న్యాయమూర్తి ప్రభాకర్‌రావు
- టైగర్‌జోన్ పరిధిలోని అధికారులకు అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

జన్నారం: కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలు సకాలంలో అందించినప్పుడే నిందితులకు సరైన శిక్ష పడుతుందని జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జన్నారం అటవీ డివిజన్ కేంద్రంలోని కమ్యూనిటీ హాలులో టైగర్ జోన్ పరిధిలోని జన్నారం, మంచిర్యాల, చెన్నూరు, ఆసిఫాబాద్, బెల్లంపల్లి అటవీ డివిజన్ అధికారులకు అటవీ సెక్షన్లు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి ప్రభాకర్‌రావుతోపాటు సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా లీగల్‌సెల్ కార్యదర్శి ఉదయ్‌కుమార్, లక్సెట్టిపేట జూనియర్ సివిల్ న్యాయమూర్తి మహ్మద్ అసదుల్లా షరీఫ్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ హాజరయ్యారు. ముందుగా సుప్రీంకోర్టు న్యాయవాది ప్రవీణ్‌భార్గవ్ జూమ్ ద్వారా అటవీ చట్టాలపై వివరించారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ కేసులు నమోదు చేసినప్పుడు సాక్ష్యాలను తప్పనిసరిగా ప్రవేశపెట్టాలని, సాక్ష్యాలు బలంగా ఉన్నప్పుడే నిందితులకు శిక్ష పడుతుందని తెలిపారు. అటవీ చట్టాలపై అవగాహన లేకపోతే నేరస్తులు తప్పించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. టైగర్‌జోన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలు ఉల్లంఘించకుండా చూడాలని తెలిపా రు. గ్రామాల్లో అటవీ చట్టాలపై అవగాహన కల్పిస్తే ప్రజలు నేరాలు చేయకుండా ఉంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఎఫ్‌డీవో వినయ్‌కుమార్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో వేణుబాబు, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, జన్నారం పరిధిలోని రేంజ్ అధికారులు హఫీజొద్దీన్, సుభాష్, రత్నాకర్‌రావు, అనిత, రవి, మంచిర్యాల, లక్సెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య, సురేందర్, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



మంచిర్యాల డిపో ఎదుట నల్లబ్యాడ్జీలతో కార్మికులు

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని మంచిర్యాల ఆర్టీసీ డిపో ఎదుట శనివారం టీఎంయూ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్మికుల ఆందోళనతో కొద్దిసేపు బస్సులు డిపోకే పరిమితం అయ్యాయి. బిల్లులపై జాప్యం చేయకుండా గవర్నర్ త్వరగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంయూ నాయకులు కేఎస్ రావు, దుర్గయ్య, నాగరాజ్, బాబన్న, ఉమారాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒకరిపై కేసు నమోదు

చెన్నూర్: పట్టణంలోని ప్రధాన రహదారిలో అతివేగంగా బైక్ నడిపిన వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. కోటపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మానుమల్ల అనిల్ గాంధీ చౌక్ ప్రాంతంలో అతివేగంగా బైక్ నడుపుతుండగా పట్టుకున్నామన్నారు.

దోమల మందు పిచికారీకి టెండర్లు

మంచిర్యాలటౌన్: జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణలో భాగంగా జిల్లాలోని 100 హాస్టళ్లలో దోమల మందు పిచికారీ చేసేందుకు గతంలో అనుభవం ఉన్న వారి నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 7న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో టెండర్లు దాఖలు చేయాలని సూచించారు.

గుండెపోటుతో ఆర్టీసీ ఉద్యోగి మృతి


బాపు (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బూసి బాపు(53) శనివారం విధులు నిర్వహిస్తుండగా మధ్యాహ్నం భోజనం తర్వాత అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మంచిర్యాలకు తీసుకెళ్లమని సూచించారు. వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసువెళ్లి చూపించగా వారు కూడా మంచిర్యాలకు రెఫర్ చేశారు. కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య గౌరుబాయి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గ్రామాల్లో పర్యటించిన అదనపు కలెక్టర్


నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని ముత్యంపేట, చెల్కగూడ, తానిమడుగు, కర్ణపేట, వందుర్‌గూడ, గూడెం, కొండాపూర్, ధర్మరావుపేట గ్రామాల్లో అదనపు కలెక్టర్ రాహుల్, డీపీవో వెంకటేశ్వర్‌రావు శనివారం పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, నర్సరీలు, పల్లెప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, సెగ్రిగేషన్ షెడ్‌లు, నూతన పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో మల్లేశం, ఎంపీవో సత్యనారాయణ, ఏపీవో దుర్గదాస్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కాజ్‌వేనే దిక్కా..?


ఇటీవలి వర్షాలకు ధ్వంసమైన రాళ్లవాగు కాజ్‌వే

- ఏటా వర్షాకాలంలో కూలుతున్న కాజ్‌వే
- రోజుల తరబడి నిలిచిపోతున్న రాకపోకలు
- రాళ్లవాగుపై బ్రిడ్జి నిర్మించాలన్న డిమాండ్ బుట్టదాఖలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణం ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నా పలుకాలనీల ప్రజలు రాకపోకలు సాగించేందుకు పలు ఇబ్బందులు పడుతున్నారు. రాళ్లవాగుపై నిర్మించిన కాజ్‌వే ఏటా వర్షాలకు కూలిపోతుండడంతో ప్రజలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. పాతమంచిర్యాల, రంగంపేట్, పవర్‌సిటీ కాలనీలో దాదాపుగా మూడు వేలకు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారంతా రాళ్లవాగుపై నిర్మించిన కాజ్‌వే(లోలెవల్ వంతెన)పైనే మంచిర్యాలకు రాకపోకలు సాగిస్తారు. పాతమంచిర్యాల జాతీయ రహదారి మీదుగా వెళ్తే నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుండడంతో రాళ్లవాగుపై నిర్మించిన కాజ్‌వే పైనుంచే రంగంపేట్, పవర్‌సిటీ, పాతమంచిర్యాల ప్రాంత ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఏటా వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే ఈ కాజ్‌వే వరద నీటిలో మునిగిపోతుంది. దీంతో వర్షాలు తగ్గే వరకు రాకపోకలు నిలిచిపోతాయి. కొద్ది రోజుల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడితే ఆయా కాలనీల ప్రజలు పాతమంచిర్యాల, గ్రీన్‌సిటీ మీదుగా వెళుతున్నారు. కానీ ఒక్కోసారి వరద ఉధృతి పెరిగి కాజ్‌వే కొట్టుకుపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. మరమ్మతులకోసం ఏటా లక్షల రూపాయల నిధులు వెచ్చిస్తున్నారు. ఇలా ఏటా మరమ్మతులకోసం వెచ్చించే నిధులతో ఎత్తయిన బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదని పలువురు పేర్కొంటున్నారు.

బ్రిడ్జి నిర్మించేలా చూస్తాం



రాళ్లవాగుపై నిర్మించిన కాజ్‌వే ఏటా వర్షాకాలంలో వరద ఉధృతికి కూలుతోంది. దానిని పూర్తిస్థాయి బ్రిడ్జిగా నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు నివేదించి, వారి ఆదేశాల ప్రకారం నిర్ణయం తీసుకుంటాం. ప్రస్తుతం రాకపోకలకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక మరమ్మతులు చేపడతాం.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, మంచిర్యాల

బ్రిడ్జి నిర్మిస్తేనే...

రంగంపేట్ కాలనీ ప్రజలు మంచిర్యాలకు వెళ్లాలంటే పాతమంచిర్యాల వద్ద రాళ్లవాగుపై నిర్మించిన బ్రిడ్జిపై నుంచి వచ్చేందుకు నాలుగు కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లడం ఇబ్బందిగా ఉందనే ఉద్దేశంతో ప్రభుత్వం 2005లో రూ.80 లక్షల నిధులతో కాజ్‌వేను నిర్మించింది. రాళ్లవాగు నీరు వెళ్లేందుకు కాజ్‌వే కింద పైపులు వేశారు. రూ.35 లక్షలతో కాజ్‌వేకు అప్రోచ్‌రోడ్డు, డ్రెయినేజీలను నిర్మించారు. కానీ ఈ కాజ్‌వేను లోలెవల్‌గా నిర్మించడం వల్ల చిన్నపాటి వర్షానికే నీటిలో మునిగిపోయి, వరద ఉధృతికి కోతకు గురవుతోంది. ప్రతీసారి కోతకు గురైన చోట తాత్కాలికంగా మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. గతంలో రంగంపేట, ఆండాళమ్మకాలనీ, పాతమంచిర్యాలకు చెందిన ప్రజలకు ఈ కాజ్‌వే ఉపయోగకరంగా ఉండేది. పట్టణ అభివృద్ధిలో ఆ ప్రాంతంలో పవర్‌సిటీ కాలనీ ఏర్పడింది. పాతమంచిర్యాల, రంగంపేట్‌లో వందలాది భవనాలు కొత్తగా నిర్మించడంతో ఈ ప్రాంతంలో నివాసాలు పెరిగాయి. దీంతో జనసంచారం ఎక్కువైంది. బ్రెడ్ కంపెనీ, రైస్‌మిల్ ఇటువైపే ఉన్నాయి. కొత్తగా లేఔట్లతో వెంచర్లను ఏర్పాటు చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న శ్రీలక్ష్మీనగర్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పెరగడంతో నిత్యం రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి.

విశ్వనాథ ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న మహిళా సభ్యులు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని విశ్వనాథ ఆలయ హుండీని శనివారం పర్యవేక్షణ అధికారి రాజమౌళి సమక్షంలో లెక్కించగా రూ. 1,92,773 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఆలయ ఈవో ముక్తారవి, అర్చకులు గోవర్ధన భట్రాచార్యులు, నరహరిశర్మ, శేషాచార్యులు, సీకేశర్మ, మహిళా సేవ సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి

చెన్నూర్: ఉపాధ్యాయులు శిక్షణ తరగతులలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించాలని జిల్లా విద్యాధికారి కాలె యాదయ్య అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు గణిత సామర్థ్యాలపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి చౌదరి, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

నస్పూర్: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం(నేషనల్ హెల్త్ మిషన్)లో పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఏఎన్‌ఎంలు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమను పర్మినెంటు చేయకుండా జూలై 20 న 1,520 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చని పక్షంలో ఈ నెల 15 నుండి సమ్మెలోకి వెళ్తామని డీఎంహెచ్‌వో సుబ్బరాయుడుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.మంజుల, తిరుమల, సత్యవతి, జ్యోతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని ఫైనాన్స్ అండ్ పా డైరెక్టర్ ఎన్.బలరాం, డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భ గనులలో ఉద్యోగుల అవసరాలకు అనుగుణంగా జనరల్ షిఫ్టులలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్, ఏరియా ఇన్‌చార్జి ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇందారం ఓసీ పీవో ఎం.శ్రీనివాస్, ఏరియా ఏజెంట్లు పీవి రెడ్డి, గోపాల్‌సింగ్, రాముడు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, డీజీఎం స్టోర్స్ యాదయ్య, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, అన్ని భూగర్భ గనుల మేనేజర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

'8న మహాసభ విజయవంతం చేయాలి'

రెబ్బెన(ఆసిఫాబాద్): ఈ నెల 8 న గోలేటిలోని కేఎల్ మహేంద్రభవన్‌లో నిర్వహించనున్న గోలేటి బ్రాంచి 3వ మహాసభను విజయవంతం చేయాలని బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. శనివారం యూనియన్ కార్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్ ఇండియా తరహాలో సింగరేణి కార్మికులు, అధికారులకు సైతం అలవెన్సులపై ఇన్‌కంట్యాక్స్ సింగరేణి యాజమాన్యమే చెల్లించాలని, సొంతింటి పథకాన్ని అమలు చేయాలని, నూతన అండర్ గ్రౌండ్ మైన్స్‌లను ఏర్పాటు చేయాలని, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా మహాసభల్లో తీర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజేశ్, కిరణ్‌బాబు, పిట్ కార్యదర్శి శ్రీనివాస్, కందుల మల్లేశ్, నాయకులు రాజయ్య, శ్రీను, రవీందర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగ భృతి వెంటనే ప్రకటించాలి'


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి వెంటనే ప్రకటించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ డిమాండ్ చేశారు. బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో నేటి వరకు ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టలేదన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3,016 చొప్పున 56 నెలలకు రూ.1,68,896 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి అమరిశెట్టి రాజ్‌కుమార్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు రాకేశ్‌రెణ్వా, నాయకులు సత్యనారాయణ, విజయ్, సాయి, తరుణ్, జగదీశ్, సాయిగౌడ్, కృష్ణ, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రిలిమ్స్ ఫుల్‌లెంత్ మార్క్‌టెస్టు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ కోచింగ్ అకాడమీ వారు ఈ నెల 16, 21, 22 తేదీల్లో టీఎస్‌పీఎస్‌సీ–2 ప్రిలిమ్స్ ఫుల్‌లెంత్ మార్క్ టెస్టు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మైనార్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీ, గురుకుల విద్యాలయం తనిఖీ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని కేజీబీవీ, బాలుర గురుకుల విద్యాలయాలను శనివారం జూనియర్ సివిల్ జడ్జి జే.ముకేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

హైదరాబాద్‌కు తరలిన నాన్‌టీచింగ్ ఉద్యోగులు


తరలివెళ్తున్న నాన్‌టీచింగ్ ఉద్యోగులు

చెన్నూర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాన్ టీచింగ్ ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర సదస్సుకు తరలివెళ్లినట్లు ఉమ్మడి జిల్లా నాయకులు పి.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. తరలివెళ్లిన వారిలో నాగరాజు, రవికిరణ్, ముజ్జు, శ్రీనివాస్, లత, సునీత, భాస్కర్, తిరుపతి ఉన్నారు.

రెండోరోజు దరఖాస్తులు నిల్

మంచిర్యాలక్రైం: జిల్లాలోని 73 మద్యం దుకాణాలకు ఈ నేల 4 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నందగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు రెండు దరఖాస్తులు రాగా శుక్రవారం ఒక్కటి కూడా రాలేదని ఆయన పేర్కొన్నారు.

పోస్టాఫీస్‌ల ద్వారా జాతీయ జెండాల విక్రయం

పాతమంచిర్యాల: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 15న దేశంలోని ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా తపాలాశాఖ అధికారి ఆర్.రామారావు తెలిపారు. జాతీయ జెండాలను పోస్టాఫీసుల ద్వారా రూ.25కు విక్రయిస్తున్నామని, ప్రతీ పౌరుడు జాతీయ జెండాను కొనుగోలు చేసి తమ ఇళ్లపై ఎగురవేయాలన్నారు.

చికిత్స పొందుతూ మాజీ ఆర్మీ జవాన్ మృతి

కాగజ్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.12 గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ జవాన్ సురేశ్ మండల్ (39) హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత నెల 31న రాత్రి ద్విచక్ర వాహనంపై ఈజ్‌గాం నుంచి ఇంటికి వెళ్తుండగా పశువును ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతునికి భార్య తపాసి మండల్, కుమార్తె అనుష్క ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న అధికారి రమేశ్ కుమార్

మంచిర్యాలఅగ్రికల్చర్: వర్షాకాలంలో మూగజీవాలకు వ్యాపించే సీజనల్ వ్యాధులపై పశువుల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేశ్‌కుమార్ తెలిపారు. శనివారం గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో గుడిపేటలోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో నూతన కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. రెండోవిడత గొర్రెల యూనిట్ల కోసం డీడీలు కట్టిన ప్రతీ ఒక్కరికి యూనిట్లు అందజేయనున్నట్లు తెలిపారు. డైరెక్టర్లు గట్టు మల్లేశ్‌యాదవ్, ముదిగిరి కొమురయ్య, పిండి నరేష్ యాదవ్, సదానందం యాదవ్, పాచ్ కుమార్ యాదవ్, రమేశ్ యాదవ్, సందన వేణి మల్లేశ్ పాల్గొన్నారు.

దొంగతనానికి వచ్చి మృత్యుఒడిలోకి..

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన


శంకర్ మృతదేహం

మంచిర్యాలక్రైం: చోరీకి వచ్చిన వ్యక్తి బావిలోపడి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఐబీ చౌరస్తాలో నివాసముంటున్న రావికంటి జనార్దన్ ఇంటివెనుక ఉన్న పాతబావిలో శుక్రవారం రాత్రి ఓ మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న సీఐ రాజు, ఎస్సై రాజేందర్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఘటన స్థలంలో సీసీ ఫుటేజిని పరిశీలించగా ఆశ్చర్యకరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నెల 3న రాత్రి 11గంటలకు ఇద్దరు వ్యక్తులు చోరీకి యత్నించిన సీసీపుటేజీ ఆధారంగా స్థానిక రాఘవేంద్ర మెడికల్ షాపు వెనుక నుంచి ఒకరు గోడపై నుంచి లోపలికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో పైనుంచి దూకాడు. అనంతరం మరో వైపుగోడ ఎక్కేందుకు యత్నించగా ప్రమాదవశాత్తు జారి సమీపంలో ఉన్న పాతబావిలో పడిపోయాడు. కొంతసేపటి తర్వాత మరో దొంగ వచ్చి అటు ఇటు తిరిగి చూశాడు. మరో వ్యక్తి కనిపించకపోవడంతో అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నించగా స్థానికులు పట్టుకుని మందలించారు. మద్యం సేవించి ఉండడంతో వదిలేశారు. కాగా చోరీకి వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు మృతి చెందగా మరొకరు పారిపోయారు. మృతుడు కాగజ్‌నగర్‌కు చెందిన శంకర్, పారిపోయింది మహేష్‌గా గుర్తించామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

పాముకాటుతో ఇద్దరు మృతి


అశోక్(ఫైల్)

పెంచికల్‌పేట్(సిర్పూర్): పదేళ్ల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా చేతికందిన దశలో కుమారుడు పాము కాటుతో మృతి చెందిన విషాద సంఘటన మండలంలోని గుండెపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అర్క అశోక్ (20) తల్లి గౌరుబాయి, సోదరునితో కలిసి శుక్రవారం రాత్రి ఇంట్లో నేలపై పడుకున్నారు. తెల్లవారు జామున కాలికి ఏదో కుట్టినట్టుగా అనిపించడంతో తల్లికి తెలిపాడు. సమీపంలో పాము కనపించడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు 2020లో ఆసిఫాబాద్ గిరిజన గురుకుల పాఠశాల నుంచి జేఈఈ మెయిన్స్‌లో పంజాబ్ ఐఐటీకి ఎంపికయ్యాడు.

తాండూర్‌లో మహిళ..

తాండూర్: తాండూర్‌కు చెందిన ఇందూరి పోశు (42) శనివారం కుటుంబ సభ్యులతో కలిసి పత్తిచేనులో కలుపు తీసేందుకు వెళ్లింది. కలుపు తీస్తుండగా పాము కాటు వేయడంతో స్పృహతప్పి పడిపోయింది. గమనించిన తోటి కూలీలు, కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలి భర్త ఇందూరి రాజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

రైతు ఖాతాలోంచి రూ.57 వేలు మాయం..!


బాధితురాలి బ్యాంకు ఖాతా

కౌటాల(సిర్పూర్): మండలంలోని ఓ మహిళా రైతు ఖాతాలోంచి రూ.57 వేలు మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాయిపేటకు చెందిన మడుపువార్ రేఖాబాయికి కౌటాల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో (79012414399) సేవింగ్ ఖాతా ఉంది. గత ఫిబ్రవరిలో ఖాతాలో రూ.17,412 ఉండగా అదే నెల 28న ఏఈపీఎస్(ఆధార్ ఎనబుల్ పేమెంట్ సిస్టమ్) ఆన్‌లైన్ ద్వారా రూ.10 వేలు విత్‌డ్రా చేసినట్లు బ్యాంకు స్టేట్‌మెంట్‌లో చూపిస్తోంది. జూన్ 14న రూ.7400 విత్‌డ్రా అయ్యాయి. సదరు ఖాతాదారుకు జూన్ 20న క్రాప్‌లోన్ రూ.40వేలు మంజూరయ్యాయి. జూలై 10న రూ.20వేలు, 11న రూ. 20 వేలు విత్‌డ్రా అయ్యాయి. తనకు అనారోగ్య కారణాలతో బ్యాంకు లావాదేవీలను పరిశీలించలేదని, గత నెల చివరి వారంలో బ్యాంకుకు వెళ్లి డబ్బులు కావాలని అర్జీ పెట్టుకుంటే అసలు ఖాతాలో డబ్బులే లేవని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో ఆమె విస్తుపోయినట్లు 'సాక్షి'కి తెలిపింది. తన ఖాతా నుంచి రూ.57 వేల నగదు మాయమయ్యాయని వాపోయింది. తన కుమారుడు శ్రీకాంత్ సహాయంతో బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించగా లావాదేవీలు బ్యాంకులో జరిగితేనే తమకు తెలుస్తుందని బయట ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా తీసుకుంటే ఖాతాదారులే బాధ్యులవుతారని చెప్తున్నారని ఆమె పేర్కొంది. ఇప్పటికైనా బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని బాధితురాలు వేడుకుంటోంది.

కిషన్‌రెడ్డిని కలిసిన ఎంపీటీసీలు

దండేపల్లి(మంచిర్యాల): ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన మండలంలోని వెల్గనూర్ ఎంపీటీసీ సభ్యురాలు చుంచు మల్లవ్వ, లింగాపూర్ ఎంపీటీసీ సభ్యురాలు బోడ అమృత, మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో నెలకొన్న సమస్యలను కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, రెబ్బనపల్లి ఎంపీటీసీ సభ్యురాలు బత్తుల మౌనిక, ఉపసర్పంచులు దుమ్మని సత్తయ్య, ముత్తె వెంకటేశ్, మండల ఇన్‌చార్జి గుండ ప్రభాకర్ పాల్గొన్నారు.


కిషన్‌రెడ్డితో ఎంపీటీసీ సభ్యులు, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్